హైదరాబాద్ వార్త



# అంగబలం, అర్థబలమే కీలకం

గెలుపు గుర్రాలపై అగ్రనేతల ఆరా

అమావాస్య తర్వాత తొలి జాబితా విడుదల



గ్రేటర్‌పై బిజెపి నజర్!

**అంబర్‌పేటలో కిషన్‌రెడ్డి, ముషీరాబాద్‌లో బండారు విజయలక్ష్మీ**

**సనత్‌నగర్ నుంచి మర్రి శశిధర్‌రెడ్డి, కుత్బుల్లాపూర్ నుంచి కూన శ్రీశైలంగౌడ్**

**మల్కాజ్‌గిరిలో రాంచందర్‌రావు, ఉప్పల్‌లో ఎన్‌విఎస్‌ఎస్ ప్రభాకర్**

**ఇతర సెగ్మెంట్లో ఒక్కో సీటుకు ఇద్దరు, ముగ్గురు**

**ఒకవైపు బిఆర్‌ఎస్ ప్రచార వ్యూహాల్లో ఉండగా, బిజెపి నుంచి పోటీ చేసే అభ్యర్థులపై పార్టీ శ్రేణుల్లో ఉత్కంఠ నెలకొంది. బిజెపి అభ్యర్థుల ప్రకటన ఇప్పటి వరకు ఖరారు కాకపోవడంతో బిఆర్‌ఎస్‌ను ఢీకొట్టే అభ్యర్థులపై జోరుగా చర్చ సాగుతోంది. అమావాస్య తర్వాతే ఆపార్టీ అభ్యర్థుల మొదటి జాబితా ప్రకటించే అవకాశం ఉండడంతో అప్పటి వరకు వేచి చూసే ధోరణిలో ఆపార్టీ శ్రేణులున్నారు.**

హైదరాబాద్, అక్టోబరు 10 ప్రభాతవార్త : ఇప్పటికే ప్రధాని మోదీ పర్యటనతో బిజెపి ఎన్నికల ప్రచారానికి తెర లేపింది. అభ్యర్థుల ప్రకటన ఖరారు అయిన వెంటనే పూర్తిస్థాయిలో బరిలోకి దిగాలనే ఆలోచనలో ఆపార్టీలో ఉంది. బిజెపిలోని అగ్రనేతలు పోటీ చేయడానికి సద్ధిమవుతున్నారు. బిజెపిలో ఇప్పటికే కొన్ని స్థానాలు ఖరారైనట్లు తెలుస్తోంది. మొదటి జాబితాలో అంబర్‌పేట నుంచి కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి, ముషీరాబాద్ నుంచి గవర్నర్ బండారు దత్తాత్రేయ కుమార్తె బండారి విజయలక్ష్మీ, సనత్‌నగర్ నుంచి మాజీ మంత్రి మర్రి శశిధర్‌రెడ్డి, ఉప్పల్ నుంచి మాజీ ఎమ్మెల్యే ఎన్‌విఎస్‌ఎస్ ప్రభాకర్, మల్కాజ్‌గిరి నుంచి మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు, కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నుంచి మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్‌లను ప్రకటించే అవకాశం ఉంది. అక్కడ అభ్యర్థుల ఎంపికను ఖరారు చేసినట్లు సమాచారం. అమావాస్య తర్వాత ఈ స్థానాల ప్రకటన ఉండనుండటంతో అప్పటి వరకు ఆశావహులు వేచిచూసే ధోరణిలో ఉన్నారు. బిజెపి జాబితా ఈనెల 15 తర్వాత ప్రకటించే అవకాశం కనిపిస్తోంది. అసెంబ్లీ ఎన్నికల్లో సీనియర్ నేతలంతగా పోటీ చేయాల్సిందేఅని బిజెపి జాతీయ నాయకత్వం ఇప్పటికే స్పష్టం చేసింది. దీంతో కేంద్ర మంత్రి, ఆపార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డితోసహ బరిలోకి దిగక తప్పని పరిస్థితి ఏర్పడింది. అయితే డాక్టర్ లక్ష్మణ్ రాజ్యసభ సభ్యుడిగా కొనసాగుతున్న నేపథ్యంలో ఆయనకు బదులు ముషీరాబాద్ నుంచి గవర్నర్ బండారు దత్తాత్రేయ కుమార్తె విజయలక్ష్మీ పేరు పరిశీనలో ఉంది.

ఎల్బీనగర్ నుంచి జి.మనోహర్‌రెడ్డి, సామ రంగారెడ్డి, వంగా మధుసూదన్‌రెడ్డి, కొప్పుల నర్సింహారెడ్డి, మహేశ్వరం నుంచి అందెల శ్రీరాములు యాదవ్, బొక్కా నర్సింహారెడ్డి, రాజేంద్రనగర్ నుంచి తోకల శ్రీనివాస్‌రెడ్డి, బుక్కా వేనుగోపాల్, వై.శ్రీధర్, శేరిలింగంపల్లి నుంచి యోగానంద్, రవికుమార్, మేడ్చల్ నుంచి మోహన్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, కూకట్‌పల్లి నుంచి మాధవరం కాంతారావు, ఎం.ప్రేమ్‌కుమార్, వడ్డేపల్లి రాజేశ్వర్, మలక్‌పేట నుంచి సురేందర్‌రెడ్డి, లింగాల హరిగౌడ్,, చీకోటి ప్రవీణ్, ఖైరతాబాద్ నుంచి ఎన్‌వి సుభాష్, చింతల రాంచంద్రారెడ్డి, డాక్టర్ ఎస్.గౌతంరావు, జూబ్లీహిల్స్ నుంచి డాక్టర్ వీరపనేని పద్మ, లంకల దీపక్‌రెడ్డి, సికింద్రాబాద్ నుంచి బండ కార్తీకరెడ్డి, జయసుధ, ఆదం విజయ్‌కుమార్, కంటోన్మెంట్ నుంచి డాక్టర్ విజయరామారావు, నారాయణరావు తదితరుల ఆశావహుల పేర్లను పార్టీ అధిష్టానం పరిశీలిస్తోంది. గోషామహల్‌లో బిజెపి నుంచి గెలిచిన రాజాసింగ్ ప్రస్తుతం సస్పెన్షన్‌లో ఉన్నారు. త్వరలో పార్టీ అధిష్టానం తనపై సస్పెన్షన్ ఎత్తివేసి టికెట్ ఇస్తుందన్న ఆశతో ఆయన ఉన్నారు. ఒక కార్పొరేటర్ కూడా తనకు టికెట్ కేటాయించాలని పార్టీని కోరుతున్నారు. ఇప్పటికే కేంద్రానికి చెందిన ఇంటెలిజెన్స్ విభాగాల ద్వారా పార్టీ విజయావకాశాలపై నివేదికలు పొందిన బిజెపి, అందులోని అంశాలను క్రోడీకరించుకొని ముందుకు వెళ్లాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది.

## నకిలీ రెగ్యులేటర్లు స్వాధీనం



**నకిలీ రెగ్యులేటర్లను స్వాధీనం చేసుకున్న బేగంబజార్ పోలీసులు**

బేగంబజార్, అక్టోబర్ 10ప్రభాతవార్త: గుట్టు చప్పుడు కాకుండా నకిలీ రెగ్యులేటర్లను అమ్మకాలు చేస్తున్న ఇద్దరులో ఒకరిన్ని అరెస్ట్ చేయగా,ఒకరు పరారీలో ఉన్నట్లు బేగంబజార్ పోలీసులు తెలిపారు.ఈ మేరకు మంగళవారం బేగంబజార్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇన్‌స్పెక్టర్ ఎన్.శంకర్,అదనపు ఇన్‌స్పెక్టర్ ఏడుకొండలు,ఎస్‌ఐ సాయి తేజా రెడ్డితో కలిసి అబిడ్స్ డివిజన్ అసిస్టెంట్ కమీషనర్ ఆఫ్ పోలీసు ఎ.చంద్రశేఖర్ మాట్లాడుతూ ఓల్డ్ ఫీల్‌ఖానా ప్రాంతంలో ధనలక్ష్మి ఏజెన్సీ పేరిట దేవరాజ్ ఫార్మర్(28),హిమ్మత్‌ఫార్మార్(22)లు గత కొద్ది రోజుల నుంచి హెచ్‌పి,ఇండియన్ గ్యాస్ సిలిండర్లకు సంబంధించిన రెగ్యులేటర్లను ఢీల్లి నుంచి తెప్పించి అమ్మకాలు చేస్తున్నారు.విశ్వసనీయ సమాచారం మేరకు బేగంబజార్ డిఐ ఏడుకొండలు,ఎస్‌ఐ సాయితేజారెడ్డి తమ పోలీసు బృందంతో ధనలక్ష్మి ఏజెన్సీపై దాడులు చేశారు.అందులో హెచ్‌పి,ఇండియన్ గ్యాస్ సిలిండర్లకు సంబంధించిన నకిలీ రెగ్యులెటర్లను దొరికాయి.20 కాటన్లల్లో సుమారు 1000కిపైగా నకిలీ రెగ్యులేటర్లను స్వాధీనం చేసుకున్నారు.ఢీల్లి నుంచి తెప్పించి నకిలీ ఇండియన్,హెచ్‌పి రెగ్యులెటర్లను సామాన్య ప్రజలకు500 రూపాయలకు అమ్మకాలు చేస్తున్నట్లు పోలీసుల విచారణలో తెలిందన్నారు. అందులో ఒకరు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. 420,486 సెక్షన్ల కింద కాఫీరైట్ కేసును నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.ఈ కేసును బేగంబజార్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## మానసిక సమస్యలకు చికిత్సలు అవసరం

**గాంధీ దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ ఎం. రాజారావు**



**విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న గాంధీ దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ ఎం. రాజారావు**

సికింద్రాబాద్, అక్టోబర్ 10 ప్రభాతవార్త: మానవ జీవితం ఎంతో విలువైందని, ప్రపంచవ్యాప్తంగా గత ఏడాది ఎనిమిది లక్షల మంది వివిధ మానసిక కారణాలతో ఆత్మహత్యకు పాల్పడ్డారని, అందుకే ఏవైనా మానసిక సమస్యలు ఉంటే వైద్యులను సంప్రదించాలని గాంధీ దవాఖాన సూపరింటెండెంట్, అదనపు డీఎంఈ డాక్టర్ ఎం. రాజారావు తెలిపారు. గాంధీ దవాఖాన ప్రధాన ద్వారం వద్ద మంగళవారం వరల్డ్ మెంటల్ హెల్త్ డే సందర్భాన్ని పురస్కరించుకొని గాంధీ దవాఖాన సైకియాట్రి విభాగం ఆధ్వర్యంలో ఫ్లాస్ మాబ్, ఓపెన్ మైక్ కార్యక్రమాలను నిర్వహించారు. గాంధీ దవాఖాన సైకియాట్రి విభాగం హెచ్ఓడీ, ఎర్రగడ్డ మానసిక చికిత్సాలయం సూపరింటెండెంట్ ప్రొఫెసర్ ఎం. ఉమాశంకర్ మాట్లాడుతూ మానసిక ఆందోళన, రుగ్మతలు, నిరాశ, ఒత్తిడి, వివక్షల కారణంగా తీవ్రమైన వ్యాధులకు గురి అవుతున్నారని అన్నారు. శరీరంలోని ఏ భాగంలో సమస్య తలెత్తినా వెంటనే వైద్యుల వద్దకు వెళ్ళే ప్రజలు మానసిక సమస్యలకు కూడా సైకియాట్రిస్ట్ వద్దకు వెళితే కౌన్సిలింగ్ ద్వారా ఉపశమనం లభిస్తుందని తెలిపారు. ఈ కార్యాక్రమంలో గాంధీ దవాఖానలోని వివిధ విభాగాల హెచ్ఓడీలు డాక్టర్ జార్జ్, డాక్టర్ శ్రవణ్‌కుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు సురేష్, అనుపమ, విద్యార్థులు పాల్గొన్నారు.

## కుత్బుల్లాపూర్‌లో ప్రమాదకరంగా డ్రైనేజీ



హైదరాబాద్, అక్టోబర్ 10, ప్రభాతవార్త : కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలో ఉన్న పలు కాలనీలలో డ్రైనేజీలు ప్రమాదకరంగా ఉన్న అధికారులు పట్టించు కోవట్లేదని కాలనీ వాసులు ప్రమాదాల భారిన పడకుండా డ్రైనేజీలపై టేబుల్, కొన్ని చోట్ల కట్టెపుల్లలు పెట్టుకున్నారు. సినిప్లేనెట్ నుండి ఫోక్స్‌సాగర్‌కు వెళ్ళే రోడ్డులో కొద్దిరోజులుగా డ్రైనేజీ ఓపెన్‌గా ప్రమాదకరంగా ఉన్నా కానీ కొంపల్లి మున్సిపాలిటీ అధికారులు పట్టించుకోవట్లేదని కాలనీకి వెళ్ళే వాహనదారులతో పాటు స్థానికంగా ఉన్నవాళ్ళు ఇబ్బందిపడుతున్నారు. చినుకు పడితే చాలు డ్రైనేజీలు పొంగి పొర్లుతుంటాయి. ప్రమాదకరంగా ఉన్న డ్రైనేజీలతో నిత్యం ఇబ్బందులు ఉండటంతో స్థానికంగా ఉన్న ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు తొందరగా డ్రైనేజీ పనులు ముగించాలని చుట్టు ప్రక్కల నివాసం ఉన్న వాళ్ళతో పాటు వాహనదారులు కోరుతున్నారు.

## మద్యం మత్తులో యువతి హంగామా

కంటోన్మెంట్, అక్టోబర్ 10 ప్రభాతవార్త: సికింద్రాబాద్ జూబ్లీ బస్‌స్టేషన్ వద్ద ఓ యువతి హాల్‌చల్ చేసింది. డ్రంక్ ఆండ్ డ్రైవ్ చెక్‌చేస్తున్న ట్రాఫిక్ పోలీసులను తప్పించుకునేందుకు కారును వేగంగా నడిపింది. సినిమా పక్కీలో ట్రాఫిక్ పోలీసులు ఛేజ్ చేసి పట్టుకున్నారు. జూబ్లి బస్‌స్టేషన్ వద్ద ట్రాఫిక్ పోలీసులు మంగళవారం తనికీలు జరుపుతున్నారు. వారినుంచి మద్యం మత్తులో కారు నడుపుకుంటు వచ్చిన యువతి తప్పించుకుంది. కారును ఆపడానికి ప్రయత్నించిన ట్రాఫిక్ పోలీసును ఢీకొట్టి వేగంగా వెళ్లిపోయింది. దీంతో ట్రాఫిక్ పోలీసులు సినిమా స్టైల్‌లో వెంబడించి బోయిన్‌పల్లి వద్ద కానును ఆపగలిగారు. దంతో యువతి నానా బూతులు తిడుతూ హంగామా చేసింది. బ్రీత్ ఎనలైజర్‌తో తనిఖీ చేయగా 427 రీడింగ్ చూపించింది. ఈవెంట్ ఆర్గనైజర్‌గా చేస్తున్న షహనాజ్‌గా గుర్తించిన పోలీసులు కేసు నమోదు చేశారు.

## సైదాబాద్‌లో 'రెండు తలల పాము'



సైదాబాద్, అక్టోబరు 10 ప్రభాతవార్త: అదృష్టానికి సంకేతంగా భావించే రెండు తలల పాము ఐఎస్ సదన్ డివిజన్‌లోని వాణినగర్‌లోని ఖాళీ స్థలంలో తిరుగుతుండడం గమనించిన లీడ్ ఇండియా స్కూల్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ప్రిన్సిపాల్ సత్య ప్రకాష్ యాదవ్ ఐఎస్ సదన్ డివిజన్ పోలీసులకు సమాచారం అదించారు. అనంతరం పోలీసుల సమక్షంలో అటవీ శాఖ అధికారులకు రెండు తలల పామును అప్పగించారు.

## నిత్యం కొత్త తపన ఉండాలి

**సిటీ పోలీస్ కమిషనర్ సివి ఆనంద్**

హైదరాబాద్, అక్టోబరు 10,ప్రభాతవార్త: హార్డ్‌వర్క్ చేసినప్పుడే ఉన్నతస్థాయికి చేరుకోగలమని హైదరాబాద్ పోలీష్ కమిషనర్ సివి ఆనంద్ అన్నారు. మనం చేసే పనితోనే తృప్తి పొందకుండా.. ప్రతిరోజు కొత్తకొత్త విషయాలు నేర్చుకోవాలనే తపన ఉండాలన్నారు. ఈమేరకు మంగళవారం సోమాజిగూడ మాక్సివిజన్‌లో నూతనంగా అందుబాటులోకి తెచ్చిన ఆధునిక సాంకేతిక పరికరాలను, ఈహెచ్ఎస్‌ల కోసం ప్రత్యేక ఫ్లోర్లను ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు సేవా గుణం అలవర్చుకోవాలని సూచించారు. తనకు డాక్టర్ ప్రసాద్‌రెడ్డి కంటి ఆపరేషన్ చేశారని ఆరోజు నుంచి ఇప్పటివరకు ఆయన సూచలను, సలహాలు పాటిస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రస్తుతం రోజురోజుకు కంటికి సంబంధించిన సమస్యలు పెరుగుతున్నాయని డాక్టర్ కాసు ప్రసాద్‌రెడ్డి తెలిపారు.




**ఎన్నికల కోడ్ అమలు నేపథ్యంలో మంగళ్‌హాట్ పోలీసులు వాహనదారులను తనిఖీలో 15లక్షలకు పైగా దొరికాయి. వెంటనే వాహనదారులు డబ్బుకు సంబంధించిన పత్రాలను, రశీదులను చూపించాలని పోలీసులు సూచించగా ఎలాంటి సమాధానం రాకపోవడంతో డబ్బును సీజ్ చేశారు.**

## ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలి

**హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్ రోస్**

హైదరాబాద్, అక్టోబరు 10 ప్రభాతవార్త : ఎన్నికల ప్రక్రియను ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, జిహెచ్‌ఎంసి కమిషనర్ రోనాల్డ్ రోస్ అన్నారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో మంగళవారం జిహెచ్‌ఎంసి ప్రధాన కార్యలయంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా అధికారి ఎన్నికల నిర్వహణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారి రోనాల్డ్‌రోస్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, షెడ్యూల్‌ను అనుసరించి నవంబరు 3న ఎన్నికల నోటిఫికేషన్ వెలువడుతుందన్నారు. ఓటరు జాబితాలో క్లెయిమ్స్, అబ్జెక్షన్‌లపై ఎలక్షన్ నామినేషన్ చివరి రోజుకు పది రోజుల ముందు అక్టోబరు 31వ తేది వరకు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. ఎన్నికల్లో వినియోగించే ఈవిఎంల ఫస్ట్‌లెవల్ చెకప్ పూర్తి చేసి విక్టరీ ప్లే గ్రౌండ్‌లో భద్రపరచడం జరిగిందన్నారు. ఈవిఎలంపై అవగాహన కోసం 397 వివిధ బస్ స్టేషన్‌లో అవగాహన కార్యక్రమాన్ని చేపట్టామని, 16 ప్రదేశాలలో ఈవిఎం, వివి ప్యాట్‌లపై 15,158 మందికి అవగాహన కల్పించినట్లు, 15 మొబైల్ వ్యాన్‌ల ద్వారా ఈవిఎం, వివి ప్యాట్‌లపై 15 నియోజకవర్గాలలో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలను నిర్వహించడం జరిగిందన్నారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అనుసరించి కంట్రోల్ రూం నుంచి డిఈఓ కార్యాలయం, ప్రతి ఆర్‌ఓ ఆఫీస్‌లలో ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో ఆరు టీంలలో ఫ్లైయింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేశామన్నారు. పొలిటికల్ పార్టీలు చేసే ర్యాలీలు, మీటింగ్‌లను వీడియో గ్రఫీ చేయడానికి 15 నియోజకవర్గాలలో 15 వీడియో సర్వైలెన్స్ టీమ్‌లను ఏర్పాటు చేశామని కమిషనర్ తెలిపారు. జనరల్ కండక్ట్‌లో భాగంగా రాజకీయ పార్టీలు భాష, మత కమ్యునిటీలను దూషించే విధంగా విధంగా ప్రవర్తించిన వారిపై ఆర్‌పి యాక్ట్ 1951 ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. రాజకీయ పార్టీలు ఇతరులను విమర్శించే విధంగా సంభాషించడానికి తెలిపారు. మజీదులు, చర్చీలు, దేవాలయాల ప్రాంగణంలో ఎటువంటి ప్రచారం నిర్వహించకూడదని తెలిపారు. కులం, మతం ఆధారంగా ఓట్లు అడగకూడదని తెలిపారు. పోలీసు కమిషనర్ ఆనంద్ మాట్లాడుతూ ఎన్నికల కోసం ఎన్‌ఫోర్స్‌మెంట్‌పై విస్తృత చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఎన్నికల కోసం ఫ్లైయింగ్ స్క్వాడ్‌లు, వివిఎస్‌టిలను ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున అక్రమ మద్యం రవాణా, నగదు ప్రవాహంపై వేగవంతమైన చర్యలు తీసుకుంటామన్నారు. రాజకీయ పార్టీలు ఓటర్లకు ఉచితంగా అందించేందుకు వస్తువులపై చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో పలువురు రాజకీయ నేతలు పాల్గొన్నారు.

## కసాయికి కఠిన కారాగారం

**బాలుడి హత్య కేసులో నిందితుడికి యావజ్జీవం**



**హత్యకు గురైన చిన్నారి భరత్‌కుమార్**



**నిందితుడు ముత్యాల రవి**

ధర్నాచౌక్, అక్టోబర్ 10, ప్రభాతవార్త: వివాహేతర సంబంధానికి అడ్డువస్తున్నాడని మూడేళ్ల బాబుని క్రూరంగా హింసించి హత్య చేసిన నిందితుడు ముత్యాల రవికి (34) నాంపల్లి కోర్టు యావజ్జీవ శిక్ష విధించినట్లు ముషీరాబాద్ సీఐ జహంగీర్ యాదవ్ తెలిపారు. గత సంవత్సరం జూలైలో రాంనగర్‌లో నివాసం ఉండే నాగలక్ష్మి అనే మహిళ ప్రియుడైన రవితో కలసి పథకం ప్రకారం కన్న కొడుకైన భరత్‌కుమార్ (3)ను హత్య చేయించి, ప్రమాదంగా సృష్టించిన ఘటన ముషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోస్టుమార్టం రిపోర్టులో వచ్చిన అంశాల ఆధారంగా విచారణ చేపట్టిన పోలీసులు బాలుడిని అత్యంత కిరాతకంగా హింసించి హత్య చేసినట్లు రుజువు చేశారు. దీనితో పోక్సో కేసు నమోదు చేసి, ఆగస్ట్ 29న నిందితులు రవి, నాగలక్ష్మిలను అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. అప్పటి నుండి విచారణ జరుపుతున్న నాంపల్లి స్పెషల్ కోర్టు మంగళవారం తీర్పును వెలువరించింది. ప్రధాన నిందితుడైన రవికి యావజ్జీవ శిక్ష (జీవించినంతకాలం జైలు), 15వేలు జరిమానా విధించిన జడ్జి బాలుని హత్య జరిగిన సమయంలో తల్లి అక్కడ లేదు కాబట్టి ఆమెను మందలించి వదిలేసినట్లు పోలీసులు తెలిపారు. కేసును ఛేదించి, నిందితులకు పట్టుకున్న ముషీరాబాద్ పోలీసులు సీఐ జహంగీర్ యాదవ్‌ను, ఎస్ఐ కే.సురేందర్ తదితర సిబ్బందిని కమీషనర్ సీవీ ఆనంద్ అభినందించారు.

## పోలీసు తనిఖీలు.. భారీగా నగదు పట్టివేత



**నగదును స్వాధీనం చేసుకున్న చాదర్‌ఘాట్ పోలీసులు**

హైదరాబాద్, అక్టోబరు 10 ప్రభాతవార్త : ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో పోలీసులు ముమ్మర తనిఖీలు చేపడుతున్నారు. గుర్తింపు పత్రాలు లేకుండా నగదు కనబడితే వెంటనే సీజ్ చేస్తున్నారు. ఈ క్రమంలో హైవేపై వెళ్తున్న వాహనాలను ముమ్మరంగా తనిఖీ చేసిన తర్వాతనే పంపిస్తున్నారు. తనిఖీల్లో అనుమతి పత్రాలు లేకండుడా నగదు దొరికితే వెంటనే సీజ్ చేస్తున్నారు. బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో భారీగా నగదును పోలీసులు పట్టుకుఆన్నరు. వాహన తనికీలు చేస్తున్న సమయంలో 3 కోట్ల ముప్పై ఐదు లక్షల నగదు పట్టుబడింది. నగదుకు సంబంధించిన లెక్కలు చూపించకపోవడంతో డబ్బులను పోలీసులు సీజ్ చేశారు. ఇదే అంశంపై మరికాసేపట్లో వెస్ట్ జోన్ డీసీపీ మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. మేడ్చల్ జిల్లాలోని మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని చెంగిచెర్ల వద్ద పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో గుర్తింపు పత్రాలు లేని ఆరు లక్షల రూపాయలను రాచకొండ ఎస్‌వోటీ అధికారులు పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఒక కారును స్వాధీనం చేసుకున్నారు. సికింద్రాబాద్ ఈస్ట్ మారేడుపల్లిలో తనిఖీల్లో మహమ్మద్ ఉమర్ అనే వ్యక్తి తన కారులో తరలిస్తున్న నగదును పోలీసులు పట్టుకొని కారును సీజ్ చేశారు.

**తనిఖీల్లో పట్టుకున్న మహంకాళి పోలీసులు.**

**బేగంపేట..** న్నికల కోడ్ అమలులోకి వచ్చిన తరువాత మహంకాళి పోలీసులు సోమవారం రాత్రి పలు జంక్షన్లలో వాహన తనిఖీలు నిర్వహించారు.ఈ తనిఖీలలో పెద్ద ఎత్తున బంగారం,వెండి,నగదును స్వాధీనం చేసుకున్నారు.సోమవారం రాత్రి మహంకాళి ఇన్స్‌పెక్టర్ పరుశురాం ఆధ్వర్యంలో పోలీసులు జనరల్ బజార్ చౌరస్తాలో తనిఖీలు చేపట్టారు.ఈ సందర్భంగా ఎలాంటి రసీదులు లేని సుమారు 3.52లక్షల నగదు,103.44గ్రాముల బంగారం, 3.4కేజీల వెండిని స్వాధీనం చేసుకున్నారు.ఇదే సమయంలో 92మద్యం బాటిళ్లను కూడా స్వాధీనం చేసుకున్నారు.అనంతరం వీటిని ఐటీ శాఖ అధికారులకు అప్పగించినట్లు పోలీసులు తెలిపారు.

**రూ. 9.3 లక్షల నగదును స్వాధీనం**

**మలక్‌పేట..** ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో పోలీసులు నిర్వహించిన తనిఖీలలో బైక్‌పై వెళుతున్న వ్యక్తి రూ. 9.3లక్షల నగదుతో వస్తుండగా పోలీసులు స్వాధీనం చేసుకున్న సంఘటన చాదర్‌ఘాట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ ప్రకాష్‌రెడ్డి కథనం ప్రకారం ఓల్డ్ మలక్‌పేట పంచశీల గ్రంథాలయంవద్ద సోమవారం రాత్రి పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా వై.గోపిరావు అనే వ్యక్తి బైక్‌పై వెళుతుండగా పోలీసులు ఆపి తనిఖీలు నిర్వహించారు. తనిఖీలలో రూ. 9.3లక్షల నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సరైన పత్రాలు చూపించకపోవడంతో నగదును స్వాధీనం చేసుకోవడం జరిగిందని పోలీసులు వివరించారు.

**మరో సంఘటనలలో..**

చాదర్‌ఘాట్ పోలీసులు మంగళవారం ఉదయం మలక్‌పేట ఫైర్ స్టేషన్ వద్ద వాహనాల తనిఖీలు చేపట్టారు. కాగా మలక్‌పేట పల్టాన్‌కు చెందిన డాక్టర్ మహ్మద్ ఎర్షాద్ అహ్మద్ (54) కారులో వెళుతుండగా పోలీసుల దనిఖీలు రూ. లక్షా 27 వేల 630 నగదును స్వా ధీనం చేసుకున్నారు. అదేవిధంగా గోషామహల్‌కు చెందిన దీపక్ (50) కారులో వెళుతుండగా రూ. 1.10 లక్షల నగదును స్వాధీనం చేసుకోవడం జరిగిందని ఇన్‌స్పెక్టర్ ప్రకాష్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

## నేడు పలు ప్రాంతాలలో నీటి సరఫరాలో అంతరాయం

హైదరాబాద్, అక్టోబరు 10 ప్రభాతవార్త : హైదరాబాద్ మహానగరానికి తాగునీరు సరఫరా చేసే కృష్ణా డ్రింకింగ్ వాటర్ సరఫరా పథకం రెండోదశలో గున్‌గల్ నుంచి సాహెబ్‌నగర్ వరకు ఉన్న 2200 ఎంఎం డయా గ్రావిటీ మెయిన్ పైప్‌లైనుకు రాగన్నగూడ వద్ద భారీ లీకేజీ ఏర్పడింది. ఈ లీకేజీని అరికట్టడానికి మరమత్తులు చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం 6గంటల నుంచి మరుసటి రోజు గురువారం 6గంటల వరకు ఈ పనులు జరుగుతాయని, ఈ నేపథ్యంలో జలమండలి పరిధిలో పలు డివిజన్‌లలో నీటి సరఫరాలో అంతరాయం కలుగుతుందని అధికారులు పేర్కొన్నారు. ఓ అండ్ ఎం డివిజన్ 1 ఎన్‌పిఏ, మిరాలం, ఓ అండ్ ఎం డివిజన్ 2 బాలాపూర్, మైసారం, బార్కస్, ఓ అండ్ ఎం డివిజన్ 5 మేకలమండి, బోలక్‌పూర్, ఓ అండ్ ఎం డివిజన్ 7 తార్నాక, లాలాపేట, బౌద్ధనగర్, మారెడ్‌పల్లి, కంట్రోల్ రూం, రైల్వేస్, ఎంఈఎస్, కంటోన్మెంట్, ప్రకాష్‌నగర్, పాటిగడ్డ, ఓ అండ్ ఎం డివిజన్ 9 హస్మత్‌పేట, ఫిరోజ్‌గూడ, గౌతమ్‌నగర్, ఓ అండ్ ఎండి డివిజన్ 10(ఏ), (బి) వైశాలీనగర్, బిఎన్‌రెడ్డి, వనస్థలిపురం, ఆటోనగర్, అల్మాపురి, ఓ అండ్ ఎం డివిజన్ 13 మహేంద్రహిల్స్, ఓ అండ్ ఎం డివిజన్ 16 బుద్వేల్, శాస్త్రీపురం, ఓ అండ్ ఎం డివిజన్ 19 బోడుప్పల్, ఓ అండ్ ఎం డివిజన్ 20 మీర్‌పేట, బడంగ్‌పేట, శంషాబాద్, మన్నెగూడ.

## ప్రేక్షకుల ఆనందోత్సవం!










మంగళవారం ఉప్పల్ స్టేడియంలో పాకిస్థాన్, శ్రీలంక మధ్య జరిగిన ఒక రోజు మ్యాచ్‌లోని దృశ్యాలు

జెండా ఊపుతున్న శ్రీలంక మహిళా అభిమాని

శ్రీలంక, పాకిస్థాన్ మ్యాచ్‌లో భారతీయ జెండా రెపరెపలు

## ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో కాంగ్రెస్ జెండా ఎగురవేయడమే లక్ష్యం : మల్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న మల్‌రెడ్డి రంగారెడ్డి

**హయత్‌నగర్, అక్టోబరు 10 ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీకి బూత్ కమిటీలే బలమని... ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో పార్టీ జెండా ఎగురవేయడమే లక్ష్యంగా బూత్ కమిటీలు పనిచేయాలని టీపీసీసీ ఉపాధ్యక్షుడు మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. నియోజకవర్గంలోని 4 మండలాలు, 4మున్సిపాలిటీలకు సంబంధించిన బూత్ కమిటీల సభ్యులకు పెద్దఅంబర్‌పేట ఔటర్‌రింగురోడ్డు సమీపంలోని తారా కన్వెన్షన్‌లో శిక్షణా శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మల్‌రెడ్డి రంగారెడ్డితో పాటు టీపీసీసీ ఉపాధ్యక్షుడు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, బూత్ ఎన్‌రోల్ ట్రైనింగ్ కమిటీ కన్వీనర్ మల్లాది పవన్‌లు బూత్ కమిటీ సభ్యులకు దిశానిర్దేశం చేశారు. రాబోయే ఎన్నికల్లో పార్టీ పటిష్టత, పోల్ మేనేజ్‌మెంట్, ప్రచార వ్యూహాలు, ఓటర్ల కలయిక, సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండే అంశాలపై సభ్యులకు శిక్షణనిచ్చారు. మల్‌రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ... నియోజకవర్గంలో పార్టీ పటిష్టంగా ఉందని, పార్టీ ప్రకటించిన పథకాలను, పార్టీ మెనిఫెస్టోను ఇంటింటికి చేర్చాల్సిన బాధ్యత పార్టీ శ్రేణులపై ఉందన్నారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులు అధికారాన్ని అడ్డు పెట్టుకుని దొడ్డిదారిన గెలవాలని ప్రయత్నిస్తారని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలన్నారు. రానున్న 45 రోజులు ఎంతో కీలకమని, ప్రతి కార్యకర్త పూర్తిసమయాన్ని పార్టీకోసం వెచ్చించాలని, వారి కష్ట సుఖాలను తాను దగ్గరుండి చూసుకుంటానన్నారు. అవినీతి, బంధుప్రీతి, కబ్జాలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచిన బిఆర్ఎస్‌పార్టీని చిత్తుగా ఓడించాలన్నారు. సమన్వయ కమిటీని ఏర్పాటుచేసి ప్రతి గడప, ప్రతి తండా, ప్రతి గ్రామంలో తిరుగుతానన్నారు. కాంగ్రెస్ గెలుపును ఏశక్తి అడ్డుకోలేదన్నారు. కార్యక్రమంలో మండలాలు, మున్సిపాలిటీలకు చెందిన పార్టీ ప్రతినిధులు పాల్గొన్నారు.

## డాక్టర్ లక్ష్మణ్‌ను కలిసిన చీకోటి ప్రవీణ్‌కుమార్


చీకోటిని సన్మానిస్తున్న డాక్టర్ లక్ష్మణ్

**సైదాబాద్, అక్టోబరు 10 ప్రభాతవార్త:** ప్రధాని నరేంద్ర మోడి చేపడుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బిజెపిలో చేరిన ధర్మపరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు చీకోటి ప్రవీణ్‌కుమార్ మంగళవారం మర్యాదపూర్వకంగా రాజ్యసభ సభ్యుడు డాక్టర్ లక్ష్మణ్‌ను కలిసారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లింగాల హరిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ ఉద్యోగులకు కౌన్సిలర్ భర్త ధన్‌రాజ్ బేషరతుగా క్షమాపణ చెప్పాలి


నల్ల బ్యాడ్జిలతో ఆందోళన చేస్తున్న పారిశుధ్య సిబ్బంది

**తుర్కయంజాల్, అక్టోబర్ 10 ప్రభాతవార్త :** తుర్కయంజాల్ మున్సిపాలిటీ సానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్‌పై దాడికి పాల్పడి, అసభ్య పదజాలంతో దూషించిన 11వవార్డు కౌన్సిలర్ భర్త గుండ ధన్‌రాజ్‌పై చర్యలు తీసుకోవాలంటూ సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపాలిటీ ఆఫీసు ఎదుట పారిశుధ్య సిబ్బంది, ఆఫీసు సిబ్బందితో కలిసి నల్ల బ్యాడ్జిలతో ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా హాజరైన కమిషనర్ శ్రీకాంత్ విచ్చేసి మాట్లాడుతూ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్‌ను దుర్భాషలాడడం సరైంది కాదని, కౌన్సిలర్ భర్త తీరును నిరసిస్తూ అనంతరం ఆదిబట్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు డి.కిషన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ కౌన్సిలర్ భర్త ధనరాజ్ ప్రభుత్వ ఉద్యోగిని అసభ్య పదజాలంతో దూషించి, దాడికి పాల్పడటం హేయమైన చర్య అని వారికి బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ శ్రీనివాస్‌రెడ్డి, ఆర్‌ఐ బాలరాజు, నగేశ్, వినయ్, సీఐటీయూ నాయకులు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ఆదునిక వ్యసనాలకు దూరంగా ఉండాలి



కార్యక్రమంలో పాల్గొన్న శ్యాంసుందర్‌రెడ్డి, విజయభవాని తదితరులు

**మలక్‌పేట, అక్టోబర్ 10 ప్రభాతవార్త :** ఆధునిక వ్యసనాలకు దూరంగా ఉండాలని ప్రముఖ సైకాలజిస్ట్ డాక్టర్ విజయభవాని, అనిబిసెంట్ ఉమెన్స్ కళాశాల కార్యదర్శి డాక్టర్ శ్యాంసుందర్‌రెడ్డిలు పేర్కొన్నారు. కళాశాలలో ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని కళాశాల సైకాలజీ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడుతూ ప్రతి ఏడుగిరిలో ఒకరు మానసిక అనారోగ్యంతో బాధపడుతున్నారని, దానికి ప్రధాన కారణం సెల్ ఫోన్ అని దీంతో సరైన నిద్ర, మనుషులతో సత్సంబంధాలు లేకపోవడం కారణమన్నారు. ఆధునిక జీవన విధానంలో మానసిక ఒత్తిడి చాలా పెరిగిందన్నారు. 20 శాతం మంది చిన్న పిల్లలు మానసిక అనారోగ్యానికి గురవుతున్నారని, వ్యక్తుల మధ్య సంబంధాలు, మానసిక అనారోగ్యాన్ని దూరం చేస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సైకాలజీ విభాగ అధికపతి యశోద, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. అంతకుముందు విజేతలకు బహుమతులు పంపిణీ చేసారు.

## మలక్‌పేటలో బిఆర్ఎస్ జెండా ఎగరవేస్తాం


సమావేశంలో ప్రసంగిస్తున్న తీగల అజిత్‌రెడ్డి

**మలక్‌పేట, అక్టోబర్ 10 ప్రభాతవార్త :** మలక్‌పేటలో బిఆర్ఎస్‌జెండా ఎగర వేస్తామని మలక్‌పేటనియోజకవర్గ బిఆర్ఎస్ అభ్యర్థి తీగల అజిత్‌రెడ్డి పేర్కొన్నారు. అజిత్‌రెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గ బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఎన్నికలకు సంబంధించిన వ్యూహాలు, అభిప్రాయాలను నాయకులు వెల్లడించారు. అనంతరం అజిత్‌రెడ్డి మాటా ్లడుతూ ప్రభుత్వ సంక్షేమాలే మనకు శ్రీరామరక్ష అని, సిఎం కెసిఆర్ అన్ని వర్గాల సంక్షేమంకోసం ఎంతోకృషి చేసారన్నారు. ఈ సారి తప్పకుండ బిఆర్ఎస్ విజయం సాధిస్తుందన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు తీగల సునరితా రెడ్డి, చైర్‌పర్సన్ అనితానాయక్, వైస్ ఛైర్మన్ అనితానాయక్, వైస్ ఛైర్మన్ భూమేష్,నాయకులు చల్లారి రఘునందన్‌రెడ్డి, కామేష్, లాయఖ్‌అలీ, పగిళ్ల శ్రీనివాస్‌రెడ్డి, బాబు సుదర్శన్, నక్క అమరేందర్‌గౌడ్, మహేష్‌కుమార్, గౌర శశిధర్, లలిత, బట్టుదాసురావు, రాముయాదవ్, నరేష్, సునిత్ పత్తి, రాజు తదితరులు పాల్గొన్నారు.

## షెడ్ల ఏర్పాటుకు ప్రత్యామ్నాయ మార్గాన్ని చూపుతాం : ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి


బాధితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

**హయత్‌నగర్, అక్టోబరు 10 ప్రభాతవార్త:** జాతీయ రహదారి విస్తరణలో భాగంగా హయత్‌నగర్ రేడియో స్టేషన్ సమీపంలో రోడ్డుపక్కన తొలగించిన షెడ్లలో జీవనం సాగిస్తున్న వారికి అండగా ఉంటానని ఎల్.బి.నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. రోడ్డు విస్తరణ కోసం షెడ్లను తొలగించిన విషయాన్ని తెలుసుకున్న ఆయన మంగళవారం బాధితులను కలిసి వివరాలు తెలుసుకున్నారు. ఆర్‌అండ్‌బీ అధికారి ధర్మారెడ్డితో మాట్లాడి వారికి ప్రత్యామ్నాయం చూపే వరకు మరికొద్ది రోజులు అక్కడే ఉండడానికి అవకాశం కల్పించాలని కోరారు. మరోచోట షెడ్లను ఏర్పాటు చేసుకునేందుకు స్థలాన్ని చూపుతామని ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వారికి హామీనిచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మన్సూరాబాద్ డివిజన్ అధ్యక్షుడు జక్కిడి మల్లారెడ్డి, యువ నాయకులు జక్కిడి రఘువీర్‌రెడ్డి పాల్గొన్నారు.

## మద్యం, డబ్బు పంపిణీపై ప్రత్యేక నిఘా : ఎన్నికల అధికారి అభిషేక్ అగస్తీ

**ఉప్పల్, అక్టోబరు 10 ప్రభాతవార్త :** ఉప్పల్ నియోజకవర్గంలో ఎన్నికలకు పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేసినట్లు ఉప్పల్ ఎన్నికల అధికారి, జిల్లా అడిషనల్ కలెక్టర్ అభిషేక్ అగస్తీ పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ఉప్పల్ సర్కిల్ కార్యాలయంలో మీడియాతో ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఎన్నికల సిబ్బందికి పూర్తి స్థాయిలో శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. ఉప్పల్ నియోజకవర్గంలో ప్రకటించిన జాబితా ప్రకారం మొత్తం 510187 మంది ఓటర్లు ఉన్నారని, వీరిలో 265493 పురుషులు, 244657 మంది మహిళలు, 37 మంది ఇతరులు ఉన్నారని తెలిపారు. నామినేషన్ ముందు రోజు వరకు కూడా కొత్త ఓటర్లు దరఖాస్తు చేసుకునే సదుపాయం ఉందని తెలిపారు. నియోజకవర్గంలో మొత్తం 407 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, సమస్యాత్మకంగా ఉన్న పోలింగ్ స్టేషన్లను గుర్తించినట్లు తెలిపారు. గతంలో గొడవలు జరిగిన 3 పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. 80 ఏళ్ల దాటిన వారికి పోలింగ్ కేంద్రాలకు రాని పరిస్థితి ఉంటే ఎన్నికల అధికారులే ఇంటికి వచ్చి ఓటు వేయించుకుంటారని తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద విద్యుత్, ర్యాంప్‌ల ఏర్పాటు, మరుగుదొడ్లు, ఇతర సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు. నేటి నుంచి అన్ని ప్రాంతాల్లో ప్రత్యేక ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలను రంగంలోకి దింపినట్లు ఆయన తెలిపారు. ఉప్పల్ మున్సిపల్ కార్యాలయంలో 24 గంటలు పనిచేసే విధంగా వివిధ శాఖల అధికారులతో ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేస్తున్నామని, మద్యం,డబ్బు పంపిణీపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించినట్లు తెలిపారు. ఎన్నికల ఫిర్యాదుల కోసం ప్రత్యేకంగా రూపొందించిన సీవిజిల్ యాప్ ప్రతి ఒక్కరు డౌన్‌లోడ్ చేసుకోవాలని, ఏదైనా ఫిర్యాదులు ఉంటే 1950 టోల్‌ఫ్రీ నెంబర్ తోపాటు,సీవిజిల్ యాప్‌కు ఫోటో తీసి పంపించాలని ఆయన సూచించారు. కాగా మంగళవారం ఉప్పల్ సర్కిల్ కార్యాలయంలో ఎన్నికల అధికారులకు వివిధ అంశాలపై ప్రత్యేక శిక్షణ ఇచ్చారు.

## మిస్ టీన్-2023 విజేత రూపికను అభినందించిన కొత్తపల్లి ఉపేందర్‌రెడ్డి


రూపికను అభినందిస్తున్న మల్కాజిగిరి బిఆర్ఎస్ ఉపాధ్యక్షులు ఉపేందర్‌రెడ్డి

**నేరేడ్‌మెట్, అక్టోబర్ 10 ప్రభాతవార్త:** నేరేడ్‌మెట్ డివిజన్ మధురానగర్ ప్రాంతానికి చెందిన రూపిక ఇటీవల మిస్ టీన్ 2023 విజేతగా నిలవడంతో మంగళవారం మల్కాజిగిరి సర్కిల్ టిఆర్ఎస్ ఉపాధ్యక్షులు కొత్తపల్లి ఉపేందర్‌రెడ్డి ఆమెను శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యుక్త వయస్సులో ఉన్నప్పుడే అన్ని రంగాల్లో రాణించాలన్నారు. జీవితంలో అనుభవం ఎంతో ముఖ్యమైనదని ఆనుభవమున్నవారు ఎంతటి కష్టాలైనా దాటుతారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## తెలంగాణ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య అధ్యక్షుడిగా మునిపల్లె శ్రీనివాస్

**ఎల్.బి.నగర్, అక్టోబర్ 10 ప్రభాతవార్త:** తెలంగాణ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు వెన్నంపల్లి జగన్మోహన్ శర్మ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గ్రేటర్ అధ్యక్షుడిగా మునిపల్లె శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా భాస్కరమూర్తి, కోశాధికారిగా రఘునందన్‌లను నియమించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ జంటనగరాలలోని అన్ని అనుబంధ సంఘాలను కలుపుకొని త్వరలో పూర్తి స్థాయి కమిటీని ఏర్పాటు చేసి బ్రాహ్మణ సంక్షేమ కార్యక్రమాలు సేవా కార్యక్రమాలు నిరంతరం నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంగు రాఘవరావు, శ్రీనివాస్, కరణం సుబ్బారావు, నందిరాజు లక్ష్మీనారాయణ, వెంకట్రాప్రగడ సుబ్బారావు, వైష్ణవి క్యాటరర్స్ ప్రసాద్, పంద్రంగి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌లో అల్మాస్‌గూడ 25వ డివిజన్ మహిళల చేరిక

**సరూర్‌నగర్, అక్టోబర్ 10 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని అల్మాస్ గూడ 25వ డివిజన్ నుండి పలువురు మహిళలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో టిపిసిసి ప్రధాన కార్యదర్శి, బడంగ్‌పేట్ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి సమక్షంలో మహిళలు సునీత, అనిత, లలిత, లల్లి, సుజాత, యశోదలతో పాటు పలువురు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా వారికి పారిజాత కాంగ్రెస్ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ వంగేటి ప్రభాకర్‌రెడ్డి, కార్పొరేటర్ పెద్దబావి సుదర్శన్‌రెడ్డి, నాయకులు రాళ్ళగూడెం శ్రీనివాస్‌రెడ్డి, గట్టు బాలకృష్ణ, వినోద్‌నాయక్, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సోషల్ మీడియాలో అభ్యంతకర పోస్టింగ్‌లు పెడితే కఠిన చర్యలు: ఇన్‌స్పెక్టర్ వెంకట్‌రెడ్డి

**సరూర్‌నగర్, అక్టోబర్ 10 ప్రభాతవార్త:** సోషల్ మీడియాలో విద్వేషపూరిత, రెచ్చగొట్టే, తప్పుడు పోస్టులు పెడితే బాధ్యులపై చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని బాలాపూర్ ఇన్స్‌పెక్టర్ బి.వెంకట్‌రెడ్డి హెచ్చరించారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. సామాజిక మాధ్యమాల్లో చేసే పోస్టింగ్‌లపై పోలీసుల నిఘా ఉంటుందనీ ఈ నేపథ్యంలో ఎవరైనా సరే అసభ్యకర చిత్రాలు, ఇతరుల మనోభావాలను దెబ్బతీసే వీడియోలు, ఫోటోలు, వ్యక్తిగత దూషణలకు సంబంధించిన పోస్టింగ్‌లు, బెదిరించడం లాంటివి పెడితే తగిన చర్యలు తప్పవని ఆయన స్పష్టం చేశారు. ఈ మేరకు వాట్సాప్, ఫేస్ బుక్, ట్విట్టర్, ఇన్‌స్ట్రాగ్రాం, టెలిగ్రాం, యూట్యూబ్ తదితర సామాజిక మాధ్యమాల్లో పోస్టింగ్‌ల విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలని ఆయన సూచించారు. లేని పక్షంలో తగిన పర్యావసనాలను ఎదుర్కోవాల్సి వస్తుందని ఇన్స్‌పెక్టర్ వెంకట్‌రెడ్డి హెచ్చరించారు.

## రాష్ట్రంలో బిఆర్ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దింపడమే లక్ష్యం : ఎమ్మెల్యే మైనంపల్లి


సమావేశంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే మైనంపల్లి

**మల్కాజ్‌గిరి, అక్టోబర్ 10 ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వాన్ని గద్దె దింపడమే లక్ష్యంగా తాను పని చేస్తున్నానని మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా మంగళవారం క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ స్థలాలన్నీ అమ్మి సంక్షేమ పథకాల పేరిట ఖర్చు చేస్తున్నారని ప్రజలకు ఇచ్చేది ఎవడబ్బ సొమ్ము కాదని అది మన సొమ్మేనని గుర్తు చేశారు. అధికారులు ప్రభుత్వ పెద్దల ఒత్తిడితో కార్యకర్తలను నాయకులను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. అంగూటా చాప్ మంత్రి మల్లారెడ్డి ఏం వెలగబెట్టాడని ప్రశ్నించారు. నియోజకవర్గంలోనే నిన్ను ఎన్నుకున్న ప్రజలే ఉరికించి కొట్టిన సంఘటన ప్రజలకు తెలిసే నీవు నీ అల్లుడు,. ఎన్ని కోట్లు ఇచ్చి సీట్లు ప్రజలకు తెలియదా ప్రజలకు తెలుసన్నారు. నా మీద బురద జల్లే ముందు అసలు నీవేంటో తెలుసుకోవాలని హెచ్చరించారు. నేను కేవలం మల్కాజ్‌గిరికే పరిమితంకాదు రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో నా కేడర్ ఉందన్నారు. రాష్ట్రప్రభుత్వాన్ని గద్దెదింపేవరకు నిద్రపోనని ఎమ్మెల్యే ప్రభుత్వంపై తీవ్రంగా విరుచుకుపడ్డారు. ఈ కార్యక్రమంలో జిఎన్‌వి సతీష్‌కుమార్, పిట్ల శ్రీనివాస్, గుండానిరంజన్, బి బ్లాక్ అధ్యక్షుడు వెంకటేష్‌యాదవ్, జీవన్‌రెడ్డి, బి కే శ్రీనివాస్,ఉమేష్‌సింగ్, జీడీ సంపత్‌గౌడ్, పంజా శ్రీనివాస్‌యాదవ్, సంతోష్ రాందాస్, శ్యామ్‌రావు, సనాది శంకర్, రోజారమణి, గద్వాల జ్యోతి, జాన్, బి.మందభాస్కర్, చాకో, శ్రీను, వినోద్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## 19వ డివిజన్ బిజెపి అధ్యక్షునిగా విజేందర్


ఉత్తర్వులను అందజేస్తున్న కార్పొరేషన్ బిజెపి అధ్యక్షుడు చెరుకుపల్లి వెంకట్‌రెడ్డి

**సరూర్‌నగర్, అక్టోబర్ 10 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని 19వ డివిజన్ బిజెపి అధ్యక్షునిగా ఎం.విజేందర్‌కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు కార్పొరేషన్ బిజెపి అధ్యక్షుడు చెరుకుపల్లి వెంకట్‌రెడ్డి ఉత్తర్వులను జారీచేసి అందజేశారు. అదే విధంగా డివిజన్ ప్రధాన కార్యదర్శిగా ఇరువెంటి శ్రీనివాసచారి, ఉపాధ్యక్షునిగా యశ్వంత్, శక్తికేంద్రం ఇంఛార్జిగా రామోజీ నాగ్‌దీప్ చారి, కో-ఇంఛార్జిగా నరేందర్, బూత్ కమిటీ సభ్యులుగా కొండ శ్రవణ్,రుద్ర ఆనంద్, గట్టు నవీన్, తాళ్ళ పవన్‌కుమార్, ఓబిసి మోర్చా ఉపాధ్యక్షునిగా పల్సం శ్రీకాంత్‌గౌడ్‌లను నియమించి వారికి కూడా ఉత్తర్వులను అందజేశారు. ఈ సందర్భంగా విజేందర్ మాట్లాడుతూ తన నియామానికి సహకరించిన నియోజకవర్గఇంఛార్జి అందెల శ్రీరాములుయాదవ్, కార్పొరేటర్ అమితశ్రీశైలంచారి, అధ్యక్షుడు వెంకట్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

## నాదర్‌గుల్‌లో బతుకమ్మ చీరల పంపిణి


చీరలను పంపిణీ చేస్తున్న మేయర్ పారిజాత, కార్పొరేటర్లు

**సరూర్‌నగర్, అక్టోబర్ 10 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని నాదర్ గుల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రాష్ట్ర ప్రభుత్వం ద్వారా సరఫరా అయిన బతుకమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ గూడెపు ఇంద్రసేనఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి నాదర్‌గుల్ కార్పొరేటర్లు, కో-ఆప్షన్ సభ్యునితో కలిసి మహిళలకు బతుకమ్మ చీరలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ బిజెపి ఫ్లోర్ లీడర్ తోట శ్రీధర్‌రెడ్డి, కార్పొరేటర్ నిమ్మల సునీత శ్రీకాంత్‌గౌడ్, కో-ఆప్షన్ సభ్యుడు మర్రి జగన్మోహన్‌రెడ్డి, నాదర్‌గుల్ మాజీ సర్పంచ్ రామోజీ శ్రీశైలం చారి, స్థానిక నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

## మలక్‌పేటలో 'నా మట్టి - నా దేశం' ముగింపు



మట్టిని సేకరిస్తున్న జిల్లా అధ్యక్షుడు సురేందర్‌రెడ్డి, కార్పొరేటర్ అరుణ

**సైదాబాద్, అక్టోబరు 10 ప్రభాతవార్త:** బిజెపి అధిష్టానం ఆదేశాల మేరకు చేపట్టిన నా మట్టి-నా దేశం ముగింపు కార్యక్రమంలో భాగంగా భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో సైదాబాద్ డివిజన్ పరిధిలోని ఆస్మాన్‌ఘడ్ హనుమాన్ దేవాలయం నుంచి చింత చెట్టు వరకు, వికె ధాగే నగర్, కళ్యాణ్‌నగర్ తదితర కాలనీలలో ఇంటింటికి తిరుగుతూ ప్రజల నుంచి మట్టిని సేకరించారు. ఈ సందర్భంగా సంరెడ్డి సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ అన్ని ప్రాంతాల నుంచి సేకరించిన మట్టిని ఒక కలశంలో చేర్చి ఆ మట్టిని ఢిల్లీకి పంపించడం జరుగుతుందన్నారు. అమృత వాటిక నిర్మాణంలో ఈ మట్టిని ఉపయోగించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి, నగర మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్ చందర్జీతో పాటు స్థానిక బిజెపి నాయకులు పాల్గొన్నారు.

## పేరుకుపోయిన చెత్త కుప్పల తొలగింపు


చెత్తను శుభ్రం చేయిస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

**వనస్థలిపురం, అక్టోబర్ 10 ప్రభాతవార్త :** బి.యన్‌రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని వైదేహినగర్ కాలనీలో రోడ్లపై చెత్త కుప్పలు ఎక్కడికక్కడ పేరుకుపోయాయని కాలనీ సంక్షేమ సంఘం సబ్యులు డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డికి తెలియజేయడంతో సంబంధిత సిబ్బందితో రోడ్లపై పేరుకుపోయిన చెత్తకుప్పలను తొలగించారు. బతుకమ్మ పండుగ పురస్కరించుకొని కాలనీలో నిర్వహించే స్థలంలో చెట్ల కొమ్మల విపరీతంగా పెరిగిపోవడంతో వాటిని కూడా సంబంధిత వాహనంతో తొలగించి శుభ్రం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి ఎస్ఎస్ అజీముద్దీన్, కాలనీ అధ్యక్షులు దామోదర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, శివరామ్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## బిజెపిలో చేరనున్న ఎమ్మెల్యే బేతి..?


ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి

**ఉప్పల్, అక్టోబరు 10 ప్రభాతవార్త :** ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి బిఆర్ఎస్ పార్టీ వీడేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఉప్పల్ ఎమ్మెల్యేగా టిక్కెట్ దక్కకపోవడంతో గత కొద్ది రోజులుగా అసంతృప్తిగా ఉన్న ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి బిజెపిలో చేరేందుకు ప్రణాళికలు సిద్ధంచేసుకుంటున్నట్లు సమాచారం. గత రెండు రోజుల క్రితం బిజెపి అగ్రనేత సునీల్ భన్సాలీ, ప్రకాష్‌జవదేకర్‌లతో నగరంలోని ఒక హోటల్‌లో బేటి అయినట్లు సమాచారం. ఉప్పల్ నియోజకవర్గం నుంచి బిజెపి టిక్కెట్ కేటాయిస్తామని హామీ ఇవ్వడంతో పార్టీలో చేరాలని నిర్ణయించినట్లు ప్రచారం జరుగుతోంది. గత కొద్ది రోజులుగా బిఆర్ఎస్ పార్టీ కార్యకలాపాలకు దూరంగా ఉంటున్న ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి పార్టీ అధిష్టానం తీరుపై తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ఇటీవల ఉప్పల్ భగాయత్ శిల్పారామం వద్ద జరిగిన బ్రిడ్జి ప్రారంభోత్సంలో మంత్రి కేటీఆర్ హాజరుకాగా, ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి గైర్హాజరయ్యారు. పార్టీ టిక్కెట్ కేటాయించకపోవడంపై గతంలో అధిష్టానంపై ఎమ్మెల్యే బేతి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. అప్పటి నుంచి కూడా ఆయన పార్టీకార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. ఉప్పల్‌లో ప్రస్తుత బిజెపి నుంచి టిక్కెట్ ఆశిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్‌ను మల్కాజిగిరి ఎంపిగా పోటీ చేయించాలని బిజెపి అధిష్టానం భావిస్తున్నట్లు పలువురు చర్చించుకుంటున్నారు. త్వరలోనే బిజెపి అగ్ర నేత జెపి నడ్డా సమక్షంలో ఇద్దరు మాజీ కార్పొరేటర్లు, కొందరు సీనియర్ నేతలతో కలిసి ఎమ్మెల్యే బేతి బిజెపిలో చేరుతున్నారని ప్రచారం జరుగుతుంది.

## మరోసారి బిఆర్ఎస్ అధికారంలోకి రావడం ఖాయం : గోగికారి శివకుమార్


రాజశేఖర్‌రెడ్డితో కలిసి కేటీఆర్‌ను కలిసిన శివకుమార్ బృందం

**కుషాయిగూడ, అక్టోబర్ 10 ప్రభాతవార్త :** బిఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన ప్రజా సంక్షేమ పథకాల మూలంగా రాష్ట్రంలో మరొక్కసారి బిఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చి తీరుతుందని బిఆర్ఎస్ కాప్రా యువత నాయకులు భోగికారి శివకుమార్ పేర్కొన్నారు. మల్కాగిరి నియోజకవర్గం బిఆర్ఎస్ అభ్యర్థి మర్రి రాజశేఖర్‌రెడ్డితో కలిసి కేటీఆర్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడవసారి హ్యాట్రిక్ సాధించే విధంగా బిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందన్నారు.

## పంచాయతీరాజ్ టీచర్స్ కాలనీ ఫేజ్-1 నూతన కార్యవర్గం ఏర్పాటు

**సరూర్‌నగర్, అక్టోబర్ 10 ప్రభాతవార్త:** మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని పంచాయతీరాజ్ టీచర్స్ కాలనీ ఫేజ్-1కు జరిగిన సంక్షేమ సంఘం ఎన్నికల్లో నూతన కార్యవర్గాన్ని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు అధ్యక్షునిగా కొమ్మిడి జగన్, ప్రధాన కార్యదర్శిగా జెల్ల శ్రీనివాస్‌గౌడ్, ఉపాధ్యక్షులుగా లక్ష్మణ్ నాయక్, రమాకాంత్‌రెడ్డి, కోశాధికారిగా ఇనుగాల నర్సింహారెడ్డి, సంయుక్త కార్యదర్శిగా రవినాయక్, కార్యవర్గ సభ్యులుగా ఎ.కృష్ణయ్య, ఎన్.కృష్ణయ్య, రమాధర్‌రెడ్డి, రాధాకృష్ణరెడ్డి, రంజిత్, సలహాదారులుగా మాధవరావు, కెపి నాయక్, పి.రవినాయక్, రామచంద్రం, వెంకటయ్య, రాజ్‌కుమార్, మూల హన్మంత్‌రెడ్డిలు ఎన్నికయ్యారు.

## సాహెబ్‌నగర్ త్రినేత్రాంజనేయ స్వామి దేవాలయ నూతన కమిటి నియామకం


సాహెబ్‌నగర్ త్రినేత్రాంజనేయ స్వామి దేవాలయ నూతన కమిటి సభ్యులు

**వనస్థలిపురం, అక్టోబర్ 10 ప్రభాతవార్త :** బిఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధి సాహెబ్‌నగర్ గ్రామం త్రినేత్ర ఆంజనేయ స్వామి ఆలయం దేవాలయ పాలకవర్గాన్ని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ధృవీకరిస్తు ప్రకటించారు. ఈ కమిటిలో సాహెబ్‌నగర్ వాస్తవ్యులు పెండ్యాల శ్రీనివాస్‌గౌడ్, బి.జంగారెడ్డి, ఈ.బాలచారి, పృధ్వీరాజ్, ఎం.పరమేష్‌గౌడ్, బి.లక్ష్మి, ఎన్.కృష్ణ సభ్యులుగా నియమితులయ్యారు. నూతనంగా ఎన్నికైన కమిటి సభ్యులు ఎమ్మెల్యేను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం పాలకవర్గం సభ్యులు త్రినేత్ర ఆంజనేయస్వామి సన్నిధిలో ప్రమాణ స్వీకారం చేశారు.

## బతుకమ్మ చీరల పంపిణీ : శ్రీలతఅనిల్‌కుమార్

**తుర్కయంజాల్, అక్టోబర్ 10 ప్రభాతవార్త :** తుర్కయంజాల్ మున్సిపాలిటీ ఉమర్‌ఖాన్‌గూడ మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున కౌన్సిలర్ ఫ్లోర్ లీడర్ కరాడి శ్రీలతఅనిల్‌కుమార్ ఆధ్వర్యంలో బతుకమ్మ చీరలు పంపిణీ చేసారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బతుకమ్మ సంబరాలను ఆనందోత్సహాలతో జరుపుకోవాలని ప్రభుత్వం చీరల పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ బిల్ కలెక్టర్ శీలం నరేష్, ఆశా వర్కర్లు కవాడపు మాధవి మల్లారెడ్డి, ఒనమాల భాగ్యమ్మ లక్ష్మారెడ్డి, మున్సిపల్ టోనీ, యాదగిరి, గడ్డం జయమ్మ సత్తెమ్మ మహిళలు పాల్గొన్నారు.

## పైప్‌లైన్ మరమ్మతు పనులను త్వరగా పూర్తి చేయాలని కార్పొరేటర్ పవన్‌కుమార్ వినతి

**ఎల్.బి.నగర్, అక్టోబర్ 10 ప్రభాతవార్త:** మోహన్‌నగర్ జలమండలి కార్యాలయం వాటర్ ట్యాంక్ ఆవరణలో కొత్తపేట డివిజన్‌కు సరఫరా అవుతున్న ప్రధానమైన వాటర్ పైపులైన్ లీకవుతుండడంతో నీటి సరఫరా ఆగిపోయింది. సమాచారం తెలుసుకున్న కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్ కుమార్ జలమండలి జీఎం బలరామ్‌ను కలిసి పైప్ లైన్ మరమ్మత్తు పనులను పరిశీలించారు. డివిజన్ ప్రజలకు నీటి సరఫరా ఆగిపోవడంతో ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని త్వరగా సమస్యను పూర్తి చేయాలని జిఎంకు కార్పొరేటర్ కోరారు. త్రాగునీటిలో డ్రైనేజీ నీళ్లు కలుషితమై ప్రజలు అనారోగ్య పాలై ఇబ్బందులకు గురవుతున్నారని, తగిన చర్యలు తీసుకోవాలని జిఎంను కోరారు. ఈ కార్యక్రమంలో ఏఈ రామకృష్ణారెడ్డి, వాటర్ లైన్ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ పాల్గొన్నారు.

## గ్రీన్ జోన్ ఎత్తివేయించిన సబితారెడ్డికి గ్రీన్ జోన్ ఐక్య సమితి పాలాభిషేకం

**సరూర్‌నగర్, అక్టోబర్ 10 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ లోని అల్మాస్‌గూడ, బడంగ్‌పేటలలో గ్రీన్ జోన్ ఎత్తివేయించినందుకు హర్షం వ్యక్తం చేస్తూ మంగళవారం గ్రీన్ జోన్ ఐక్య సమితి ఆధ్వర్యంలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డికి పాలాభిషేకం చేశారు. చాలా సంవత్సరాల నుండి గ్రీన్ జోన్ సమస్యను తీర్చాలని పోరాడుతున్న వారికి ఊరట కల్పించే విధంగా మంత్రి చర్యలు తీసుకున్నందుకు కృతజ్ఞతగా బిఆర్ఎస్ పార్టీ నాయకులతో కలిసి సమితి సభ్యులు బడంగ్‌పేట్‌లోని పెద్దబావి మల్లారెడ్డి ఫంక్షన్‌హాల్‌లో సబితారెడ్డికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో బడంగ్‌పేట్ కార్పొరేషన్ బిఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ సూర్ణగంటి అర్జున్, పార్టీ అధ్యక్షుడు రామిడి రాంరెడ్డి, కార్పొరేటర్ ఏనుగు రాంరెడ్డి, నాయకులు భీమిడి జంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.